వైభవంగా పెద్దమ్మతల్లి జాతర

- భారీగా హాజరైన భక్తులు
- వసతులులేక ఇబ్బంది పడ్డ ప్రజలు


ఆలయ పరిసరాల్లో జనసందోహం

పెద్దవూర : రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే గిరిజనుల ఆరాధ్యదైవమైన పెద్దమ్మతల్లి జాతరను మండలంలోని పిన్నవూర, నాయినివానికుంటతండా, ఎర్రకుంటతండాల్లో మంగళవారం ఘనంగా భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ జాతరకు కులాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు వేల సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం వేకువజామునుంచే జాతర వద్ద భక్తుల తాకిడి ఎక్కువైంది. పంట పొలాలతో పాటు దేవాలయం వద్దకు దారి కూడా ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రెండు వందల మీటర్ల దూరం వెళ్లటానికే భక్తులకు గంట సమయం పట్టింది. దేవాలయం పూజారులు దేవుడు బావోజీ, కిషన్ నాయక్‌ల సమక్షంలో ప్రత్యేక పూజలు చేశారు. జాతర వద్ద దేవాలయానికి ఎదురుగా నిలిపి ఉంచిన ప్రభలు పలువురిని ఆకట్టుకున్నాయి. రంగు రంగుల వస్త్రాలు, కాగితాలతోనూ, దేవుళ్ల పటాలను ఉంచి ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోలలో ప్రభలను భక్తిశ్రద్ధలతో తయారు చేసి గ్రామాలలో ఊరేగింపు చేసుకుని వచ్చి దేవాలయం చుట్టూ ప్రదిక్షణలు చేసి దేవాలయం ఎదురుగా వరుస క్రమంలో నిలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన స్నేహితులు, కుటుంబసభ్యులతో వచ్చిన భక్తులకు దేవాలయం పరిసరాలలో ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాగటానికి మంచినీళ్లు లేక తాము తెచ్చుకున్న వాహనాలలో కిలోమీటర్ల దూరం వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వచ్చింది. రెండేళ్లకొకసారి జాతర జరగడంతో పిన్నవూర వద్దకు భక్తులు జిల్లా నుంచే మహబూబ్ నగర్, రంగారెడ్డి తదితర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.


ట్రాక్టర్ల ద్వారా ఆలయానికి చేరుతున్న భక్తులు


పొలాల గట్టుపై నుంచి వెళ్తున్న భక్తులు

హాలియా మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే నోముల భగత్


అనుములలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా : హాలియా మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని నాగార్జున సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. హాలియా మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో రూ. 20లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులను ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. గతంలో హాలియా పట్టణాన్ని పాలించిన పాలకులు ఏనాడు అభివృద్ధిని పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో హాలియా మున్సిపాలిటీ రూపురేఖలు మారుతున్నాయన్నారు. పట్టణంలో వెజ్, నాన్ వెజ్ మార్కెట్, మినీ స్టేడియం, లైబ్రరీ, డిగ్రీ కళాశాల అభివృద్ధి పనులు సీఎం కేసీఆర్ నాయకత్వంలో జరుగుతున్నట్లు తెలిపారు. అనంతరం పట్టణంలోని 4వ వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. కంటి జబ్బుతో బాధపడే రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మశంకరయ్య, కమిషనర్ కందిమళ్ల వీరారెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కురాకుల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు చెరుపల్లి ముత్యాలు, మండల ప్రధాన కార్యదర్శి సత్యం, కౌన్సిలర్లు ప్రసాద్ నాయక్, శ్రీనివాస్, వెంకటయ్య, కోఆప్షన్ సభ్యులు లక్ష్మమ్మ లింగయ్య, చాపల సైదులు, నాయకులు ఈదయ్య, జింకల ప్రసాద్, యాదవ ఉద్యోగుల సంఘం నియోజకవర్గ నాయకులు బాలరాజు, పట్టణ యూత్ అధ్యక్షుడు సైదాచారి, మెండె సైదులు, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బుర్రి మొగులయ్య, పిల్లి వెంకట్ యాదవ్, బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు పిల్లి అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తు గడువు పొడిగింపు

కొండమల్లేపల్లి : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్), ఉమ్మడి గురుకులాలకు సంబంధించి ఐదో తరగతిలో ప్రవేశానికి సంబంధించి టీజీ–సెట్ దరఖాస్తు గడువును మార్చి 16వ తేదీ వరకు పొడిగించినట్లు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ సి.విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి

మిర్యాలగూడ టౌన్ : అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ మంగళవారం ఆర్డీఓ చెన్నయ్య, మిర్యాలగూడ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావులకు జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే భాస్కర్‌రావు పట్టణ పరిసరాల్లో ప్రభుత్వ భూములను గుర్తించి ఇవ్వాలని సర్వేయర్ బాలాజీనాయక్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్‌తో పాటు పలు జర్నలిస్టు సంఘాల నాయులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ఉన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

గుర్రంపోడు : మండలంలోని కొప్పోలు జెడ్పీ ఉన్నత పాఠశాలకు మంగళవారం లయన్స్‌క్లబ్ నల్లగొండ డైమండ్ వారు క్రీడా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కె. శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం శ్రీనయాచారి, లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు బుర్రి భూపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు గొర్రె సుదర్శన్‌రెడ్డి, కోశాధికారి తేలుకుంట్ల సంజీవరెడ్డి , వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి..

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని బంగారుగడ్డలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి మార్కులను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ కోటయ్య, ఉపాధ్యాయులు వీరనారాయణ, రామ్‌సింగ్, వీర రాఘవులు, మహర్షి, సంఘం బాబురావు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ


ఆర్టీసీ డ్రైవర్లకు మజ్జిగ అందజేస్తున్న డీఎం

దేవరకొండ : దేవరకొండ ఆర్టీసి డిపోలో మంగళవారం డిపో మేనేజర్ రాజీవ్ ప్రేమ్‌కుమార్ ఆర్టీసీ ఉద్యోగులకు మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం ప్రారంభమైన నేపథ్యంలో డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లతో పాటు డిపో కార్మికులకు ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రతి రోజు మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగాచారి ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

హాలియా : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని హాలియా మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మశంకరయ్య, కమిషనర్ కందిమళ్ల వీరారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా హాలియా పట్టణంలో మంగళవారం చేపట్టిన స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాలీని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో శంకరయ్య, మున్సిపల్ మేనేజర్, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుపై కేంద్రం నిర్లక్ష్యం తగదు

చింతపల్లి : ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్ ప్రవేశపెట్టి ఆమోదించడంలో కేంద్రం నిర్లక్ష్యం తగదని, కేవలం వాగ్దానాలకే పరిమితమవుతుందని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు ఎవూరి రాజు, రాష్ట్ర కార్యదర్శి వింజమూరి కృష్ణయ్యలు అన్నారు. వర్గీకరణ కోసం చేపట్టిన పాదయాత్ర మంగళవారం పోలేపల్లిరాంనగర్, గొడుకొండ్ల, మాల్ వెంకటేశ్వరనగర్‌లో పాదయాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఇన్‌చార్జ్ పోతెం సహదేవుడు, మాసని పెద్దయ్య, ఏసు, రమేష్ పాల్గొన్నారు.

దైవభక్తిని అలవర్చుకోవాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ప్రతి ఒక్కరూ దైవ భక్తిని అలవర్చుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బోయగూడెం గ్రామంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం నిర్వహించిన ముత్యాలమ్మ జాతరలో ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జయవీర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ యాదవ్, శ్రీధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆస్తి పన్ను బకాయిలను వసూలు చేయాలి


మాట్లాడుతున్న మున్సిపల్ ఆస్తి పన్ను పర్యవేక్షణ అధికారి శ్రీపాద రామేశ్వర్

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో ఈనెల చివరి వరకు ఆసి పన్నుల బకాయిలను పూర్తి స్థాయిలో వసూలు చేసేందుకు మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది సిద్ధంకావాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్, మున్సిపల్ ఆస్తి పన్నుల పర్యవేక్షకులు శ్రీపాద రామేశ్వర్, మున్సిపల్ కమిషనర్ రవీందర్‌సాగర్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ చాంబర్స్‌లో ఏర్పాటు చేసిన మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది నిర్వహించిన సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. మున్సిపాలిటీలో ఎక్కువ శాతం పాత బకాయిలు ఉన్నాయని, వాటిని వసూలు చేసేందుకు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆస్తి పన్నుల వసూళ్లలో ఎవరిని కూడా ఉపేక్షించేది లేదన్నారు. పాత బకాయిలు చెల్లించకుంటే మున్సిపల్ రెవెన్యూ చట్టం ప్రకారం ఆస్తులను జప్తీ చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ రెవెన్యూ అధికారిని కళ్యాణి, ఆర్. రాకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, బిల్ కలెక్టర్లు కలీల్, పుష్ప, యాదగిరి, ఎల్లయ్య, బిక్షం, రమేష్ తదితరులున్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా 'చలో ఢిల్లీ'

వేములపల్లి : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న నిర్వహించే 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి నుంచి మార్చి వరకు గ్రామస్థాయి నుంచి మొదలుకొని మండల, జిల్లా కేంద్రాల్లో విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి, సీఐటీయూ నాయకులు మల్లు గౌతంరెడ్డి, పాల్వాయి రాంరెడ్డి, పుల్లయ్య, ప్రణీత్ రెడ్డి, వెంకన్న, సైదులు, శ్రీనివాస్‌రెడ్డి, యేసేబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వీరపల్లి వెంకటేశ్వర్లు

సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శం


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ : సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు.మంగళవారం దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాలకు చెందిన 69మందికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.27.50లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. ఆపద సమయాల్లో నిరుపేదలను సీఎం సహాయనిధి ఆపన్నహస్తంలా ఆదుకుంటుందన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పేదల చెంతకు రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, జెడ్పీటీసీలు మారుపాకుల అరుణ సురేష్‌గౌడ్, బాలునాయక్, చింతపల్లి సుభాష్, బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, కేసాని లింగారెడ్డి, రహత్‌అలీ, టీవీఎన్ రెడ్డి, లోకసాని తిరుపతయ్య, పస్నూరి యుగేందర్‌రెడ్డి, గంధం సురేష్, వేముల రాజు, బొడ్డుపల్లి కృష్ణ , తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ గోపిరాం

దేవరకొండ : నేటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని దేవరకొండ ఆర్డీఓ గోపిరాం అన్నారు.మంగళవారం దేవరకొండలోని ఆర్డీవో కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవరకొండ డివిజన్‌లో మొత్తం 8పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అధికారులు అన్ని వసతులు కల్పించాలని ఆయన ఆదేశించారు. అనంతరం విద్య, వైద్య, విద్యుత్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులకు పలు సూచనలిచ్చారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని వైద్య సిబ్బంది ఓఆర్‌ఎస్ వంటి వాటిని అందుబాటులో ఉంచాలని ఆయన పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాల న్నారు. ఈ సమావేశంలో దేవరకొండ తహసీల్దార్ రాజు, ఎంఈఓ మాతృనాయక్, విద్యుత్, ఆర్టీసీ, వైద్య అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలలకు దాతల సాయం అభినందనీయం


మాట్లాడుతున్న మండల విద్యాధికారి తరి రాము

గుర్రంపోడు : పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలలకు దాతల సాయం అభినందనీయమని మండల విద్యాధికారి తరి రాము అన్నారు. మంగళవారం మండలంలోని జూనూతుల ప్రాథమికోన్నత పాఠశాలలో అదాని గ్రీన్ ఎనర్జీ (సోలార్‌ప్లాంట్) కంపెనీ జూనూతుల వారు విద్యార్థులకు చైర్లు, డ్యూయల్ డెస్కులు, టేబుల్స్, వైట్ బోర్డులను పంపిణీ చేసిన సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు దాతలు అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల సాయం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో అదాని గ్రూప్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ కంచర్ల జగదీశ్వర్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం మేకల అన్నపురెడ్డి, గ్రామ యువజన నాయకులు జానారెడ్డి, మారపాక నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడంతో పాటు సంక్షేమ వసతిగృహాలను ఏర్పాటు చేయాలని కోరుతూ ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మంగళవారం కొండమల్లేపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ స్టేట్ కోఆర్డినేటర్ ఎండీ.ఖదీర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కొండమల్లేపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఏకుల సురేష్, సేవానాయక్, కార్తిక్, బొడ్డుపల్లి వేణు, నాగేంద్ర బాబు తదితరులున్నారు.

బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులకు అభినందన


విద్యార్థినులను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

డిండి : కర్నాటక రాష్ట్రంలోని ఉడిపీలో ఇటీవల నిర్వహించిన 18వ నేషనల్ యూత్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్(అండర్ –18)లో పాల్గొని బంగారు పతకాలు సాధించిన మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన అవుట అఖిల, ఎం.శృతి, సిహెచ్ శైలజ, కె.సింధు, సిహెచ్.కీర్తన మంగళవారం ఆ పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించి అభినందించారు. అవుట అఖిల 1500 మీటర్ల పరుగు పందెం, సిహెచ్ కీర్తన 2000 మీటర్లు స్టీఫల్ చేస్‌లో, మిడ్లే రిలే పరుగు పందెంలో, ఎం.శృతి, కె.సింధు, సీహెచ్, శైలజ బృందం బంగారు పథాన్ని సాధించారు. క్రీడా పోటీలు ముగియడంతో డిండి చేరుకున్న విద్యార్థినులకు ఘనంగా స్వగతం పలికి డప్పు చప్పుళ్లతో ర్యాలీగా పాఠశాలకు తీసుకెళ్లారు. అక్కడ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అభినందించిన వారిలో సర్పంచ్ మేకల సాయమ్మ కాశన్న, ఉప సర్పంచ్ నూకం వెంకటేష్, ఎంపీటీసీ ఏటి రాధిక కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, పీఈటీ జ్యోతి, కోచ్ పరుశురాం, నాయకులు జి.శ్రీను, బి.శైలేష్, శ్రీనివాస్‌గౌడ్, ఖలీం, సురేష్, దినేష్, రశీదు, భీముడు, చెన్నయ్య, వెంకటయ్య, రామస్వామి పాల్గొన్నాడు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వినతి

హాలియా : మున్సిపాలిటీ పరిధిలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ కాల్వల నిర్మాణానికి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ రూ. 4.5 కోట్ల మంజూరయ్యాయని, టెండర్ ప్రక్రియ ద్వారా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఆరు నెలలు అవుతున్నా పనులు ప్రారంభించలేదని తక్షణమే ఆతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేష్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం హాలియాకు వచ్చిన జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆయన పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్మటి వెంకట్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు కరెడ్ల నరసింహా, ప్రకాష్‌రెడ్డి, నవీన్, వినోద్ తదితరులు ఉన్నారు.

హమాలీలకు లైసెన్స్‌లు మంజూరు


హమాలీలకు లైసెన్స్‌లు అందజేస్తున్న చంద్రారెడ్డి

నిడమనూరు : వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో పని చేసే హమాలీలకు చైర్మన్ మర్ల చంద్రారెడ్డి మంగళవారం లైసెన్స్‌లు అందజేశారు. మార్కెట్ కమిటీ కార్యాయలంలో మంగళవారం మార్కెట్ పాలక మండలి సమావేశం నిర్వహించారు. ఈఓ వేణుకుమార్, మార్కెట్ డైరెక్టర్లు దిలీప్‌కుమార్, ఖాసీం, లచ్చయ్యగౌడ్, నాగరాజు, సత్యవతి, శ్రీనివాస్, మోహన్‌రావు, యాదయ్య పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మిర్యాలగూడ అర్బన్ : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ లో పట్టణంలోని రెడ్డి కాలనీ గల డౌహిల్ హైస్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో పదో తరగతి విద్యార్థులు పి.భానుప్రసాద్ ప్రథమ ర్యాంకు సాధించగా కె.గోకుల్ క్రిష్ణ రెండో ర్యాంకు సాధించారు. దీంతో మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ పి.సాయి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఎం. శ్రీకాంత్‌లు విద్యార్థులను అభినందించారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


మిర్యాలగూడ అర్బన్ : పోలీస్‌స్టేషన్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

దేవరకొండ : రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ ప్రదీప్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం దేవరకొండలో బూత్ స్వశక్తి కరణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన శక్తి కేంద్రం దేవరకొండ నియోజకవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో గోలి మధుసూదన్ రెడ్డి, సురేష్, నర్సింహ, ఏటి.కృష్ణ, కల్యాణ్‌నాయక్, లాలూనాయక్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ అర్బన్ : రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేస్తూ నిరంకుశ పాలన సాగిస్తుందని బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి బంటు గిరి అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం ధర్నాలకు పిలుపునివ్వడంతో మిర్యాలగూడ బీజేవైఎం, బీజేపీ నాయకులను తెల్లవారుజాము నుంచే అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో పోలీస్ స్టేషన్‌లో నిరసన తెలిసిన అనంతరం ఆయన మాట్లాడారు. అరెస్టు అయిన వారిలోనాయకులు బంటు యాదగిరి, శేఖర్, వేణు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వేములపల్లి : అక్రమ అరెస్టలతో ఉద్యమాలను ఆపలేరని బీజేపీ మండల అధ్యక్షుడు చిర్ర సాంబమూర్తి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి పర్యటనను ఎక్కడ అడ్డుకుంటారోననే భయంతోనే బీజేపీ నేతలను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. అరెస్ట్ అయిన వారిలో పెదమాం వెంకన్న, బీజేపీ మండల కార్యదర్శి చిలువేరు జగదీష్, బీజేవైఎం కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న జెడ్పీటీసీ పుల్లెంల సైదులు


మాడుగులపల్లి : క్షయవ్యాధిపై అవగాహన అవసరమని జెడ్పీటీసీ పుల్లెంల సైదులు, సర్పంచ్ శోభ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్య సిబ్బంది క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు హాజరై మాట్లాడారు. క్షయ ప్రాణాంతకం కాదని, భయాందోళన అవసరం లేదన్నారు. 15రోజులు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం లాంటి లక్షణాలు కనిపిస్తే క్షయ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే పోషకాహారం తీసుకునేందుకు ప్రభుత్వం రోగి ఖాతాలో నెలకు రూ.500 జమ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కట్టా లింగారెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు, ఆశవర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

అడవిదేవులపల్లి : మండలంలోని బంగారికుంట తండా గ్రామ పంచాయతీలోని చింత చెట్టు తండా ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఘనంగా స్వపరిపాలన దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధికారులుగా, ఉపాధ్యాయులుగా, ప్రజా ప్రతినిధులుగా, రాజకీయ నేతలుగా వ్యవహరించి పలువురిని ఆకట్టుకున్నారు. అనంతరం ప్రతిభ గల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్మూర్తి, ఉపాధ్యాయురాలు ఆశాలత, బీఆర్ఎస్ మండల పార్టీ కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, గ్రామ పార్టీ అధ్యక్షుడు నేనావత్ శ్రీనునాయక్, బాలు, స్వామి, బాను, హరి, పచ్యా, రామస్వామి, లక్‌పతి, రాములు, దంజా, సక్రు, రాహుల్, హక్యా ఉన్నారు.

ఇష్టపడి చదివితేనే మంచి ఫలితాలు


మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే మంచి ఫలితాలు వస్తాయని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పట్టణంలోని అరోరా జూనియర్ కళాశాలలో నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో పరీక్షలపై భయాలను తొలగించేందుకు ఇలాంటి పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవినాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, శంకర్ నాయకులు శంకర్‌నాయక్, సైదానాయక్, వదూద్, సగన్ పాల్గొన్నారు.

కంపోస్ట్ ఎరువు తయారీపై అవగాహన

మిర్యాలగూడ : మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో వర్మీ కంపోస్టు ఎరువు తయారీ విధానంపై మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, స్థానిక సర్పంచ్ వెంకటరమణ చౌదరీలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉపాధిహామీ నిధులతో నిర్మించబడిన కంపోస్టుషెడ్‌ను వంద శాతం ఉపయోగంలోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో పలు కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఏలు, ఎఫ్ఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు